క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మార్కెట్ ఏరియాలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ లావణ్య, టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. మంగళవారం కూరగాయల మార్కెట్లో ట్రాఫిక్ సమస్యపై నేరుగా పర్యవేక్షించారు. రోడ్డుపై స్ట్రీట్ వెండర్స్‌ను మార్కెట్ కాంప్లెక్స్, రైతుబజార్‌లో అమ్మకాలు సాగించేలా చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ సమస్యకు పరిష్కారానికి ప్రతిపాదనలు చేశారు. ట్రాఫిక్ సమస్యను ఇరు శాఖలు సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఏ. రమేశ్, టౌన్‌ప్లానింగ్ అధికారి అన్సార్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్

వేములవాడ: పట్టణంలోని బీమేశ్వరవీధిలో గల దుకాణంలో ఓ నాగుపాము మంగళవారం హల్‌చల్ చేసింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులోని ఓ కిరాణ దుకాణంలో నాగుపాము కనిపించడంతో షాప్ యజమాని ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్ బాబుకు సమాచారం ఇవ్వగా గంటపాటు వెతికి దాన్ని పట్టుకున్నాడు. అనంతరం పామును పట్టణ శివారులో మైదాన ప్రాంతంలో వదిలిపెట్టారు. 8 ఫీట్ల పొడవున్న నాగుపామును చూసేందుకు జనం పెద్దఎత్తున వచ్చారు.

అన్నదాతలకు అండగా ఉండాలి



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న నాయకులు

ముస్తాబాద్: అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన అన్నదాతలకు అండగా నిలవాలని పలు పార్టీల నాయకులు అన్నారు. ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండా, తెర్లుమద్ది గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. చేతికందిన పంట అందకుండా పోయిందని రైతులు వాపోయారు. ముస్తాబాద్‌లో మూడు ఇళ్లు కూలిపోగా బాధిత కుటుంబాలను నాయకులు పరామర్శించారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత రైతులకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ కనమెని చక్రధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపి, బీజేపీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్రరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కిషన్‌రావు, గౌతంరావు, అంజన్‌రావు, దీటి నర్సింలు, గుండెల్లి శ్రీను, గజ్జెల రాజు, తదితరులున్నారు.

వాల్ పోస్టర్ల తొలగింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా మండలకేంద్రంలో వాల్ పోస్టర్లు, జెండాలు, ఫ్లెక్సీలను జీపీ సిబ్బంది తొలగించారు. వివిధ ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో ఉన్న పార్టీల జెండాలు తొలగించి గ్రామ పంచాయతీకి తరలించా రు. నాయకులు ఎన్నికల నిబంధనలు పా టిం చాలని సహకరించాలని కార్యదర్శి దేవరాజు కోరారు.

కోనరావుపేట: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో గ్రామాల్లో వివిధ పార్టీ ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను సిబ్బంది తొలగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు

సిరిసిల్లటౌన్: ఇటీవల సిరిసిల్ల పాత బస్టాండ్‌లో గుర్తుతెలియని వృద్ధుడు సంచరించగా మంగళవారం కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. పట్టణంలో ఓ వృద్ధుడు ఒంటరిగా ఉండటాన్ని సఖిసెంటర్ నిర్వాహకులు గమనాఇంచి జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు తంగళ్లపల్లిలోని వృద్ధుల ఆశ్రమంలో చేర్చారు. వృద్ధుడి వివరాలకోసం ఆరాతీయగా సిద్దిపేట జిల్లా చేర్యాలగా తెలిసింది. వెంటనే ఆశ్రమం సిబ్బంది డీడబ్ల్యూవో ఆదేశాల మేరకు గ్రామానికి చెంది వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళపై దాడి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన డీటీ లక్ష్మి అనే మహిళపై దాడి చేసిన ఘటనలో ఒకరిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. లక్ష్మికి తన బావ అయిన శ్రీనివాస్‌తో కొంతకాలంగా ఇంటికి సంబంధించిన గొడవలున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాస్ కుమారుడు తిరుపతి లక్ష్మి ఇంటికి వచ్చి ఇంటి పంపకం విషయంలో గొడవపడి లక్ష్మిపై దాడి చేశాడు. ఇంట్లో పశువుల కోసం నిల్వచేసిన పశు గ్రాసానికి నిప్పంటించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

కల్లాల నిర్మాణం కలేనా?

- మండలంలో 197 కల్లాలకు 31 మాత్రమే పూర్తి
- మూడేళ్ల కిత్రం రూ.కోటి 75 లక్షలు మంజూరు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



అల్మాస్‌పూర్‌కు వెళ్లే రహదారిపై ఆరబోసిన ధాన్యం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని పొలం వద్దనే ఆరబెట్టుకునేందుకు అమలు చేస్తున్న కల్లాల నిర్మాణాలు కలగానే మిగిలాయి. రైతులు కల్లాలు ఏర్పాటు చేసుకోవడంపై గ్రామాల్లో అధికారులు ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. ఫలితంగా ఈ పథకంపై అవగాహన లేక రైతులు నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. రైతుల కల్లాల ఏర్పాటుకు మోక్షమెప్పుడని..? రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 24 గ్రామాల్లో 197 కల్లాల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం మూడేళ్లక్రితం రూ.కోటి 75లక్షల 46వేలు నిధులు మంజూరు చేసింది. ఏడాదిలోగా 197 కల్లాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూ చించగా, ఇప్పటివరకు కేవలం 31 కల్లాలు మాత్రమే పూర్తిచేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో కల్లాల ఏర్పాటు కాగితాలకే పరిమితం కాగా రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వేరే ప్రాంతాలకు తరలించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి సీజన్‌లో ప్రధాన రహదారులపైనే ధాన్యం ఆరబెడుతూ ఇబ్బందులు పడుతున్నారు.

116 కల్లాలకు మార్కింగ్..

మండలానికి 197 కల్లాలను మొదటి విడతలో మంజూరు చేయగా అధికారులు గ్రామాల్లో రైతులను ఎంపిక చేశారు. వారినుంచి దరఖాస్తులు స్వీకరించి 116 కల్లాల ఏర్పాటుకు అధికారులు మార్కింగ్ చేశారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా కల్లాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా వ్యవసాయశాఖ అధికారులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పనులను పర్యవేక్షించాల్సి ఉంది. ఈ మూడు శాఖల అధికారుల నిర్లక్ష్యంతో కేవలం మూడేళ్లలో 31 కల్లాలు మాత్రమే పూర్తిచేశారు. రైతులకు కల్లాల ఏర్పాటుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే లక్ష్యం చేరుకునేవారు.

మూడు పద్ధతుల్లో కల్లాల ఏర్పాటు..

కల్లాల ఏర్పాటు మూడు పద్ధతుల్లో పొలం విస్తీర్ణం, ఎకరాల చొప్పున నిర్మాణం చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 50 స్క్వేర్ మీటర్లకు రూ.56,100, 60 స్క్వేర్ మీటర్లకు రూ.68వేలు, 75స్క్వేర్ మీటర్లకు రూ.85వేల చొప్పున ఉపాధి హామీలో నిధులు కేటాయించింది. అన్నదాతలకు అవగాహన కల్పించి వీటిని అందుబాటులోకి తేవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందకు అరిగోస పడుతున్నారు. అధికారులు సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా కల్లాల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

అవగాహన కల్పించడం లేదు



రైతులకు కల్లాల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. కల్లాల గురించి తెలియకపోవడంతో నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకురావడం లే దు. పండించిన ధాన్యాన్ని క ల్లాలు లేక ఆరబెట్టుకోవడం ఇబ్బంది అవుతోంది.

– బందారపు బాల్‌రెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

ఇబ్బందులు పడుతున్నాం



ధాన్యం అరబెట్టుకునేందుకు సౌకర్యం లేక మండల రైతులు ఇబ్బందులు పడుతున్నా రు. ప్రతి సీజన్‌లో ఇదే పరిస్థి తి. అధికారులు రైతుల ఇబ్బందులు గుర్తించడం లేదు. కొత్త ప్రభుత్వంపై రైతులు ఆశతో ఉన్నారు. రైతుల కష్టాలు గుర్తించి కల్లాలు ఏర్పాటు చేయాలి.

– మధుసూదన్‌రెడ్డి, రైతు, నారాయణపూర్

తొందర్లోనే పూర్తిచేస్తాం



ప్రభుత్వం మండలానికి 197 కల్లాలు మంజూరు చేసింది. వెంటనే 116 కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించి మార్కింగ్ చేశాం. రైతులు కల్లాల ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. ఎంపిక చేసిన వారిని కాకుండా కొత్తవారిని ఎంపిక చేసి పూర్తిచేస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. నీటి పారుదల శాఖ ఏఈ అనిల్ మాట్లాడుతూ మండలానికి రూ.50 లక్షల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, మరమ్మతు పనుతో పాటు బద్దెనపల్లి, చిన్నలింగాపూర్, చింతలపల్లి గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు నిచ్చెనలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గోపాల్‌రావుపల్లెలో వాటర్ ట్యాంకుకు నిచ్చెన నిర్మించాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ పద్మనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. సంపులో మోటార్ కాలిపోవడంతో ఇబ్బంది ఏర్పడగా సరిచేశామని తెలిపారు. ఎంపీటీసీ బైరినేని రాము మాట్లాడుతూ చిన్నలింగాపూర్‌కు టీఏలు రావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ లేరన్నారు. నాలుగేళ్లుగా ఉపాధిహామీ ద్వారా రోడ్డు వేయాలని కోరుతున్నా పట్టింపులేదన్నారు. ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైర్ల కింద పూలమొక్కలు మాత్రమే నాటాలన్నారు. వర్షాకాలంలో నరికివేస్తున్నారన్నారు. ఇందుకు తగు చర్యలు తీసుకుంటామని సెస్ అధికారులు తెలిపారు. ఎంపీటీసీ రాజిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ కోసం చాలామంది డీడీలు చెల్లించారని తెలపగా రీఫండ్ కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేస్త రీఫండ్ చేస్తామని పశువైద్యాధికారి సంతోష్ తెలిపారు. ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఏ పథకానికైనా రేషన్ కార్డు తప్పనిసరి చేశారని కానీ కార్డులు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీవో(ఎఫ్ఏసీ) జోగం రాజు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ గౌడ్, సూపరింటెండెంట్ విజయేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ అంజయ్య, ఎంపీటీసీలు బుస్స స్వప్న, రేణుక, గుగ్గిళ్ల లావణ్య, సిలివేరి ప్రసూన, కళ, ములిగె దుర్గాప్రసాద్, కరికవేని కుంటయ్య, బైరినేని రాము, రాజిరెడ్డి, గ్రామాల స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ



చెక్‌పోస్ట్ వద్ద తహసీల్దార్, పోలీసులు

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాక వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం తహసీల్దార్ పుష్పలత, వేములవాడ రూరల్ సీఐ మందాడి శ్రీనివాస్, ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మంద నారాయణ, అనారోగ్యంతో మృతిచెందిన అల్లం మల్లయ్య కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పార్టీపరంగా ఆదుకుంటామన్నారు. నాయకులు పందిర్ల పర్శరాములు గౌడ్, ఎడ్ల సందీప్, సల్మాన్, శివరామకృష్ణ తదితరులున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం




మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. పాఠశాలలోని 15మంది విద్యార్థులు కరాటే పోటీల్లో కటాస్ వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో ఒకనవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, సర్టి ఫికెట్లు ప్రదానం చేశారు. డీన్ విజయ్‌కుమార్, ఏవో శేఖర్, పీఈటీలు బాపురెడ్డి, నరేందర్, మానస, ప్రైమరీ ఇన్‌చార్జ్ దివ్య, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ పూర్ణిమ, కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులు



కొండపై వేంకటేశ్వర స్వామి

- ఐదు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- 23న కల్యాణం, 25న రథోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- తరలిరానున్న భక్తులు

చందుర్తి (వేములవాడ): మండలంలోని బండపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి 25వరకు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ, గురు, శుక్రవారాల్లో ఉదయం స్వామివారికి మేలుకొలుపు, నిత్యారాధన, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనములు, అంకురారోపణ, ధ్వజారోహనం, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్టాహోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కొందుగుల్ల శ్రీకాంతాచార్యులు తెలిపారు.

పూజా కార్యక్రమాలు, రథోత్సవం

ఈనెల 23న ఉదయం స్వామివారికి ఉదయం మేలుకొలుపు, అభిషేకాలు, 11.05 గంటలకు స్వామి కల్యాణమహోత్సవం, సాయంత్రం ధ్వజా కుంభారాధన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీ కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇదీ.. ఆలయ చరిత్ర

సుమారు 80 ఏళ్ల క్రితం గ్రామ శివారులో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండేది. ఆదరణ కరువై పూర్తిగా శిథిలావస్థకు చేరింది. (పాతికేళ్ల క్రితం) ఇదే గ్రామానికి చెందిన వరి భూమయ్యకు స్వామివారు కలలోకి వచ్చి గ్రామ నడిబొడ్డున గుట్టపై ఆలయం నిర్మించాలని కోరినట్లు తెలుపుతున్నారు. గ్రామస్తుల సహకారంతో 1997లోనే గుట్టపై ఆలయాన్ని నిర్మించారు. తిరుమల–తిరుపతి దేవస్థానం నుంచి స్వామివారి, అమ్మవార్ల విగ్రహాలు తెప్పించి చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా ప్రతిష్ఠించారు. ప్రతి శనివారం భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టు పక్కగ్రామాల భక్తులే కాకుండా నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్, మహారాష్ట్ర, మెదక్, పూణా లాంటి పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లిస్తారు.

వేములవాడ పట్టణానికి 15.మీటర్ల దూరంలో..

వేములవాడ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో బండపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు వెళ్లే మార్గంలో ఉన్న బండపల్లికి ఉదయం 7.30 గంటలకు, 9గంటలకు ఆర్టీసీ బస్సులు ఉండగా, మిగతా సమయాల్లో కోరుట్ల బస్టాండ్ ప్రాంతం బండపల్లి వెళ్లేందుకు ఆటోలు ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి తెలిపారు.

కాలువ ఇలా.. నీరు వెళ్లేదెలా?



కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో మురుగుకాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. నిజామాబాద్ నుంచి వెంకట్రావుపేటకు వెళ్లే దారిలో ఉన్న మురుగుకాలువ మొత్తం పిచ్చిమొక్కలతో నిండింది. సిబ్బంది శుభ్రపర్చకపోవడంతో నీరు నిల్వ ఉండి దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రత్యేకాధికారులు, కార్యదర్శి పట్టించుకొని మురుగుకాలువలోని పిచ్చి మొక్కలు తొలగించి నీరు వెళ్లేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



తంగళ్లపల్లిలో పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. 35 పరీక్షా కేంద్రాల్లో 6,473 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 6,467 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థిగా ఒకరు హాజరైనట్లు డీఈవోరమేశ్ వెల్లడించారు. సిరిసిల్ల గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, తంగళ్లపల్లి మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పరీక్షల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్, నాయకులు



ముస్తాబాద్ : బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రేణుకా, జమదగ్ని కల్యాణ వేడుకలు నిర్వహించి బోనాలు తీశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులు ప్రభాకర్, బైరగోని నందూగౌడ్, పుంగంగౌడ్, సత్యం, లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు..

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సిద్ధోగంలో భాగంగా మంగళశారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రేణుక జమదగ్నిల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యం

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను

సిరిసిల్లటౌన్: బీఎస్పీతోనే బహుజన రాజ్యం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను పేర్కొన్నారు. సిరిసిల్లలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంపై వ్యాఖ్యానించారు. ఇలాంటి వాళ్లు వస్తుంటరు..పోతుంటరు..కానీ బీఎస్పీ మాత్రం బహుజన వాదానికి పుట్టిళ్లుగా వర్ధిల్లుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్, నాయకులు ఎనగందుల వెంకన్న, పిట్టల భూమేశ్, చాకలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల ద్రోహి ప్రవీణ్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజనుల ద్రోహి అని బీఎస్పీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ అన్నారు. తంగళ్లపల్లిలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం బహుజన సమాజ్ పార్టీని వీడి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు.

బీఎస్పీని వీడేది లేదు..

వీర్నపల్లి: బీఎస్పీని ఎట్టి పరిస్థితుల్లో వీడేది లేదని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ స్పష్టం చేశారు. మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ రాజీనామా నేపథ్యంలో మండలంలోని బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు అయోమయానికి గురికావొద్దన్నారు. రానున్న రోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

చిరు ధాన్యాలతో పోషకాలు



వేములవాడ రూరల్ : పోషణ్ అభియాన్‌లో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలు

వేములవాడరూరల్: చిరు ధాన్యాల్లో మంచి పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీరాజం అన్నారు. మండలంలోని తుర్కాశీనగర్‌లో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ నిర్మలదేవి, రోజా, అంగన్‌వాడీ టీచర్లు, పద్మ, ఏసుమణి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంనిర్వహించారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కిశోర బాలికలకు రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ అఖిల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్‌లో అల్మాస్‌పూర్–హరిదాస్‌నగర్ గ్రామాల రెడ్డి సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అల్మాస్‌పూర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉచ్చిడి శ్రీనివాస్‌రెడ్డి, హరిదాస్‌నగర్ అధ్యక్షుడు ఆరుట్ల రాంరెడ్డిలు మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి సంఘం ప్రతినిధులు నాగెల్లి వెంకట్‌రెడ్డి, కమాలాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, అనంత రెడ్డి పాల్గొన్నారు.

అన్వేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన తెలంగాణ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డికి మండలానికి చెందిన పలువురు నాయకులు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బీపేట కుమార్‌తోపాటు పలువురు ఫోన్‌లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.

ఘన నివాళి

సిరిసిల్లటౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రధాన కార్యదర్శి జువ్వాజి విమల మాట్లాడారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోయినపల్లి: మండలంలోని తడగొండకు చెందిన నిరుపేద కార్మికుడు మంచాల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మంగళవారం రూ.5వేలు ఆర్థికసాయంగా అందించారు. ఎంపీటీసీ శ్రీనివాస్, ముదాం శ్రీనివాస్, తదితరులున్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట ఎంపీటీసీ మేరుగు నాగభూషణం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు పంపించారు. వ్యక్తిగత కారణాలతో పార్టీలో కొనసాగలేనని పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకే ఫీజులు తీసుకోవాలి

ముస్తాబాద్: మండలంలో ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల మేరకే ఫీజులు తీసుకోవాలని ఎంఈవో బన్నాజీ అన్నారు. మండల పరిషత్‌లో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. పరీక్ష సమయాల్లో ఫీజు కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దన్నారు. నోటీస్ బోర్డులపై ఫీజుల వివరాలను ప్రదర్శించాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, ఎమ్మార్సీ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ రాజేందర్, పాఠశాలల బాధ్యులు పాల్గొన్నారు.

పార్టీపై ఆరోపణలు అవాస్తవం

ఎల్లారెడ్డిపేట: మండల మాజీ సెస్ డైరెక్టర్ కుంభాల మల్లారెడ్డి పార్టీపై చేసిన ఆరోపణలు అవాస్తవమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి కేవలం వందరోజులు పూర్తి అయినా ఇంకా హామీలు నెరవేర్చేందుకు నాలుగున్నర సంవత్సరాల కాలం ఉందన్నారు. మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, ఏలూరి రాజయ్య, బీపేట రాజు, తదితరులు పాల్గొన్నారు.